క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్ల నియామకం


దాట్ల వెంకట అప్పల ప్రసాద్‌రాజు


పోతిన హనుమంతు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భీమిలి నియోజకవర్గం నుంచి ఇద్దరిని ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా దాట్ల వెంకట అప్పల ప్రసాదరాజు, పోతిన హనుమంతులను నియమించారు.

స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం


స్నేహితుడు తేజాకి ఆర్థిక సాయం చేస్తున్న పీపుల్ పవర్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలోని పీపుల్ పవర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం తమ స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరి స్నేహితుడు తేజ చేయి విరగడంతో పాటు గట్టి దెబ్బలు తగిలాయి. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు, సేవా సంస్థ అధ్యక్షుడు నిమ్మకాయల భాస్కర్, శివ గోపీనాథ్, అర్వింద్ తదితరులు తేజా వైద్యం కోసం రూ. 10,500 ఆర్థిక సాయం అందించారు.

అంగరంగ వైభవంగా రావణవధ


బాణసంచాతో రావణవధ నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంబీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా గురువారం ఉత్సాహంగా రావణవధ ఉత్సవం జరిగింది. 25 అడుగులు ఎత్తుగల రావణాసురుని బొమ్మను బాణసంచాతో పేల్చారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస భక్తులకు విజయదశమి, రామలీలా ప్రాముఖ్యత గురించి తెలిపారు. హరేకృష్ణ వైకుంఠంలో వరుసగా రెండో ఏడాది ఈ ఉత్సవం నిర్వహించినట్టు తెలిపారు. రాధాకృష్ణ డ్యాన్స్ అకాడమీ, నాట్యరసజ్ఞ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అంబరీష దాస ఆధ్వర్యంలో మంగళహారతి, ప్రసాద వితరణ గావించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న మండల స్పెషలాఫీసర్ జ్ఞానవేణి

పద్మనాభం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ఒక్కో కుటుంబానికి రూ.14 వేల నుంచి రూ. 15 వేల వరకు ఆదా అవుతుందని మండల స్పెషలాఫీసర్ జ్ఞానవేణి అన్నారు. పద్మనాభంలోని మహిళా మార్టు వద్ద శుక్రవారం జీఎస్టీ తగ్గింపుపై మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు, పనిముట్లపై ఐదు శాతం మాత్రమే జీఎస్టీ విధిస్తారన్నారు. బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో ట్రాక్టర్ ద్వారా జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె కొంత దూరం ట్రాక్టర్ నడిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రూపేష్, జీఎస్టీ ఏసీటీవో రవి, తహసీల్దార్ ఆనందరావు, వెలుగు ఏపీఎం బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.


ఆశ్రమంలో భోజనం చేస్తున్న చిన్నారులు


విద్యార్థులకు దాతలు బహూకరించిన లాకర్లు


దాతలు ఇచ్చిన యూనిఫారంలో చిన్నారులు

అమ్మ చేతి స్పర్శలా..

- చిన్నారులను తల్లిలా సాకుతున్న భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమం
- దాతల సాయంతో అమ్మను మరిపించే ఆదరణ
- క్రమశిక్షణతో చిన్నారులను సాకుతున్న ఆశ్రమ నిర్వాహకులు


చిన్నారులు స్కూల్‌కు వెళ్లడానికి దాతలు బహూకరించిన ఆటో

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో అయిదేళ్ల క్రితం నగరానికి చెందిన భరోసా లవ్ ఫర్ హ్యుమానిటీ అధ్యక్షుడు అత్తాడ అవినాష్, తగరపువలసకు చెందిన వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమం పేరుతో సంస్థను నెలకొల్పారు. ఇందులో ఉత్తరాంధ్రకు చెందిన 25 మంది తల్లిదండ్రులు లేని పిల్లలతో పాటు తండ్రి లేదా తల్లి లేని పూర్తి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించారు. అప్పటి నుంచి వీరి ఆలనా పాలనా సొంత తల్లిదండ్రుల వలే చూస్తూ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్య, వసతి, భోజనం సమకూరుస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాతలు వీరికి నిత్యం అండగా ఉంటూ చిన్నారులకు అవసరమైన ఆహారం, సామగ్రి సమకూరుస్తున్నారు. ఇక్కడి చిన్నారులలో ఎవరిని కదిలించినా ఒక్కొక్కరూ ఒక్కో కన్నీటి గాథ వినిపిస్తారు. తల్లిదండ్రులు ఇద్దరూ లేక నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల చాటున ఉండేవారు కొందరైతే.. అమ్మ లేదా నాన్న కుటుంబాలను వదిలేసి వెళ్లిపోయినప్పుడు మిగిలిన వారికి భారంగా ఉన్నవారే ఈ ఆశ్రమంలో ఉపశమనం పొందుతున్నారు.

ఉదయం 5 గంటలకు యోగాతో ప్రారంభమయ్యే వీరి దినచర్య కాలకృత్యాలు తీర్చుకోవడం, చదువుకోవడం ఉదయం అల్పాహారంగా పాలు, ఉప్మా, ఇడ్లీ, దోశ, వడ, పెరుగు అన్నం మధ్యాహ్న భోజనం కింద అన్నం, రసం, కూర, పెరుగు, ఉదయం, సాయంత్రం స్నాక్స్, తిరిగి రాత్రి అన్నం, సాంబారు, కూర, పెరుగుతో ముగుస్తుంది. ఇక్కడ ఉన్న 25 మంది చిన్నారులలో 17 మంది తగరపువలస సాయిరవీంద్ర పాఠశాలలో 6 నుంచి 10 వరకు చదువుతుండగా మిగిలిన 8 మంది స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో చదువుతున్నారు. దాతల ఇళ్లలో జరిగే పెళ్లి, పుట్టినరోజు తదితర వేడుకలను ఈ అనాథ బాలల మధ్య జరుపుకున్నప్పుడు ప్రత్యేకంగా బిర్యానీ, చికెన్, స్వీట్లు, పండ్లతో పాటు దుస్తులు, యూనిఫారాలు, దుప్పట్లు, పుస్తకాలు, బియ్యం, లాకర్లు, నిత్యావసర సరుకులు, స్నాక్స్ అందిస్తారు. నెలలో 20 నుంచి 25 మంది దాతలే ఆహారం అందించగా మిగిలిన రోజుల్లో నిర్వాహకులే వారికి ఎలాంటి లోటు లేకుండా తల్లిదండ్రులను మరిపించేలా చూసుకుంటున్నారు. ఆశ్రమంలో వీరికి టీవీ, ఫ్రిడ్జి, వాషింగ్‌మిషన్, ఏసీ వంటి సదుపాయాలు ఉన్నాయి.


తాళ్లవలసలోని భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమం

- ఆశ్రమంలో చిన్నారులకు అవసరమైన మందులు సాయి శిరీషా మెడికల్స్ అందిస్తుండగా ఉచిత వైద్యం లక్ష్మీ విజయ మెడికవర్ వైద్యులు రామభద్రరాజు, రమ్య, శ్రీనివాసా హెల్త్‌కేర్‌కు చెందిన చెరుకూరి నవీన్ గుప్త చూస్తుంటారు. చిన్నారులు పాఠశాలకు వెళ్లి రావడానికి తగరపువలసకు చెందిన డీసీఆర్ యజమాని దుర్గా శేఖర్ ఆటో సమకూర్చారు. రామన్నపేట సాయి రవీంద్ర కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ ఏటా రూ.లక్ష విలువైన విద్య, స్టేషనరీ ఉచితంగా అందిస్తున్నారు. ఆశ్రమంలో వంటశాలకు గాను భీమిలికి చెందిన పీవీ రమణయ్య ఏజెన్సీ నుంచి వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సమకూరుస్తున్నారు. నెలకు ఆశ్రమానికి రూ.1.50 లక్షలు అయ్యే ఖర్చును నిత్యం దాతలు, నిర్వాహకులే సమకూరుస్తుంటారు.


స్టోర్‌రూమ్‌లో తినుబండారాలు, స్టేషనరీ

దాతలు ఆప్యాయంగా చూసుకుంటారు..



దాతలు ఆశ్రమానికి వచ్చినప్పుడు ఎవరూ లేని ఈ చిన్నారులను తమ పిల్లలుగా చూసుకుంటారు. వారికి అవసరమైన వాటిని అందిస్తూ వెళ్తుంటారు. దాతలు ఎవరైనా ఈ చిన్నారుల మధ్య ఫంక్షన్లు చేసుకోవాలంటే 8500264289, 9502085850 నంబర్లలో సంప్రదించవచ్చు. – వెంపాడ పద్మ, వార్డెన్

అమ్మ ఆస్పత్రిలో పని చేస్తోంది..



అమ్మ పద్మ ఆస్పత్రిలో పని చేస్తూ చెల్లి దివ్యతో అమ్మమ్మ వాళ్లింట్లో ఉంటుంది. నేను ఈ ఆశ్రమంలో ఉంటూ పదవ తరగతి చదువుకుంటున్నాను. అమ్మ చూసుకుంటున్నట్టే అంతకంటే ఎక్కువగా కూడా ఇక్కడ చూస్తున్నారు. – అల్లాడ రామకృష్ణ, అల్లిపురం

క్రమశిక్షణ అలవాటైంది..



అమ్మ ఇళ్లల్లో పని చేసుకుని అక్కను పోషిస్తోంది. నేను ఆశ్రమంలో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాను. ఇక్కడ చక్కటి క్రమశిక్షణ అలవాటయింది. ఏదైనా సాధించి దాతల సాయానికి ప్రతిఫలం చూపిస్తాను. – గోడి మణికంఠ, మద్దిలపాలెం

వార్డెన్లు అమ్మలాగా చూసుకుంటున్నారు..



నాన్న సాలూరులో మెకానిక్, అమ్మ లేదు. అన్నయ్య, అక్కలు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. మా దగ్గర సరైన విద్యా సదుపాయాలు లేనందున ఈ ఆశ్రమంలో ఉంటూ ఒకటో తరగతి చదువుతున్నాను. వార్డెన్లు అమ్మలాగ చూసుకుంటున్నారు. – చిట్ల కార్తీక్, సాలూరు

ఇక్కడి పిల్లలంతా నావారే అనే భావన..



నాకు కుమారుడు తప్ప ఎవరూ లేరు. అందుకే ఈ ఆశ్రమంలో ఉంటున్నాం. నేను ఇక్కడి చిన్నారులకు వంట చేసి పెడుతూ ఇక్కడే తలదాచుకుంటున్నాను. అందరూ నా పిల్లలే అన్న భావనతో ఇక్కడ పని చేస్తున్నాను. – రాజీ, కుక్, పూసపాటిరేగ

క్రమశిక్షణకు మారుపేరుగా..



ఈ ఆశ్రమంలో ప్రతీది క్రమశిక్షణతో జరుగుతుంది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు అలాగే చదువులు, ఆటలు, యోగా, నడవడిక ఒక పద్ధతిలో జరుగుతాయి. సెలవు రోజుల్లో చిన్నారుల సంబంధీకులు ఉంటే వచ్చి తీసుకెళ్తారు. లేదంటే మేమే చూసుకుంటాం. – అక్కరమాని సంధ్య, వార్డెన్

ముగిసిన విజయదశమి వేడుకలు

ప్రత్యేక పూజలు.. హోమాల నిర్వహణ


వేములవలస కూడలిలో శ్రీపైడితల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం


పద్మనాభంలో ఆకట్టుకున్న బళ్ల వేషాలు


చంద్రంపాలెంలో అన్న సమారాధనకు హాజరైన భక్తులు


గెద్దపేటలో కలశాలతో నీరు తీసుకెళ్తున్న మహిళలు

తగరపువలస: విజయదశమి సందర్భంగా ఆనందపురం మండలం వేములవలసలోని శ్రీలక్ష్మీ పైడితల్లమ్మ ఆటో యూనియన్ కార్మికులు గురువారం వేడుకలను ప్రారంభించారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవతను అక్కడి హైస్కూల్ 2018–19 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు గులాబీ, జరబర పువ్వులలో అలంకరించారు. బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు దర్శించుకుని అన్నదాన కార్యక్రమానికి రూ.15వేలు అందించారు.

చంద్రంపాలెంలో భారీ అన్న సమారాధన..
మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ప్రముఖ క్రికెటర్ వేణుగోపాల్, హేమలత దంపతుల సహకారంతో అమ్మవారికి లడ్డూ ఇతర ప్రసాదాలు నివేదించి భక్తులకు పంచిపెట్టారు. దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో దుర్గానగర్‌కి చెందిన జీకే బిల్డర్స్ గోకరకొండ శ్రీకాంత్, లక్ష్మీచైతన్య దంపతులు, భాస్కర్, నగర్‌కి చెందిన బండి కిషోర్ కుమార్, కృష్ణ కుమారి దంపతుల సహకారంతో సుమారు 6 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.


భక్తి శ్రద్ధలతో హోమాలు, పూజలు..
రేవళ్లపాలెం శ్రీ సాయి సూర్య రెసిడెన్సీలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ అమ్మ వారు, టైలర్స్ శ్రీ విజయ దుర్గాదేవి తదితర ఆలయాల్లో హోమాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముగిసిన శరన్నవ రాత్రి ఉత్సవాలు..
పద్మనాభం: కోరాడ పంచాయతీ గెద్దపేటలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో దుర్గాదేవికి జలాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. పద్మనాభంలో దుర్గాదేవిని ఊరేగింపుగా తీసుకెళ్లి గోస్తనీ నదిలో నిమజ్జనం చేశారు.

శిల్పారామంలో ముగిసిన దసరా సంబరాలు..
పీఎం పాలెం: దసరా సంబరాలను పురస్కరించుకుని గురువారం స్థానిక జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహిషాసుర మర్దిని నృత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులు లిఖిత, లూహిత, దీక్ష, భవ్య, ఆశ్రిత, లక్ష్మి, మూక్షిత, కోమలి, శ్రీనిధి తదితర చిన్నారులు పాల్గొనగా మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు. అలాగే కారుషెడ్ బబ్బేలమ్మ శ్రీ రాజరాజేశ్వరీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు..
భీమునిపట్నం: ఇక్కడి మెయిన్ రోడ్డు పాత బస్టాండ్ వద్ద నూకాంబిక ఆటో డ్రైవర్స్ ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అలాగే పురాతన చోడేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ


మార్కుల లిస్టులు పొందిన విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జెడ్పీ హైస్కూల్లో గత ఏడాది పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుక్రవారం ఒరిజినల్ మార్కుల లిస్టులు పంపిణీ చేశారు. 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు దాడిశెట్టి రమేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు ఇజ్రాయెల్ రోమర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండగా న్యాయస్థానం


మాట్లాడుతున్న ఒకటవ అడిషనల్ జ్యుడీషియల్ సివిల్ జడ్జి అండ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ స్వాతి భవానీ

పీఎం పాలెం: సీనియర్ సిటిజన్లకు అన్యాయం జరిగినప్పుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తే వారికి చట్టం అండగా ఉంటుందని జిల్లా 1వ అడిషనల్ జ్యుడీషియల్ సివిల్ జడ్జి అండ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి. స్వాతి భవానీ అన్నారు. శుక్రవారం మారికవలసలో గల గోల్డేజ్ వృద్ధుల ఆశ్రమంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కౌన్సిల్ అండ్ న్యాయవాది నమ్మి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించండి

తగరపువలస: దసరా సెలవులు ముగిసినందున తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్‌కు పంపించాలని కోరుతూ భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. కమిటీ చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న తాటితూరు, టి.నగర పాలెం, సామియ్యవలస, తాటితూరు కల్లాలు, వేముల వారి కల్లాల్లోని సుమారు 253 మంది విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి చదువు ఆవశ్యకతను వివరించనున్నారు. పేరెంట్స్ కమిటీ హాజరు పెంచేందుకు చేస్తున్న అవగాహన కార్యక్రమాలపై సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు తదితరులు అభినందించారు.

వ్యవసాయ యాంత్రీకరణతో అభివృద్ధి


దాకమర్రిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

తగరపువలస: వ్యవసాయ యాంత్రీకరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి అన్నారు. శుక్రవారం భీమిలి మండలం దాకమర్రిలో జీఎస్టీ సేవింగ్స్‌పై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లపై ప్రస్తుతం జీఎస్టీ గణనీయంగా తగ్గిందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.శివకోమలి, ఏపీఎంఐపీ పీడీ మన్మథరావు, పశు సంవర్ధకశాఖ ఏడీ వి.సునీల్, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి సురేష్, సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పశు వైద్యాధికారి కాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యర్థాలు కలవకుండా చూడాలి


అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

కొమ్మాది: కాలువల్లో వ్యర్థాలు సముద్రంలో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎనిమిదవ వార్డు సాగర్‌నగర్ వద్దనున్న సివరేజ్ పంప్‌హౌస్ ప్లాంట్‌ను ప్రధాన ఇంజినీర్ పి.వి.వి.సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలు బీచ్‌లో కలవకుండా చూడాలని దానివల్ల అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కాలువల్లో స్క్రీనింగ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని సహాయ ఇంజినీర్ శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ నరేష్‌కుమార్, కార్యనిర్వహక ఇంజినీర్లు ఏడుకొండలు, సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీకి చెందిన రైతు లండ వెంకటరావు (45) చికిత్స పొందుతూ గురువారం కేజీహెచ్‌లో మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మద్యానికి బానిసై తరచూ భార్య వరాన్ని డబ్బుల కోసం వేధించేవాడు. గత నెల 30న ఇదే విధంగా భార్యతో పొలానికి వెళ్లి మద్యం తాగేందుకు డబ్బుల కోసం తగాదా పడ్డాడు. ఆమె నిరాకరించడంతో తన పొలంలోనే గడ్డి మందు తాగాడు. వెంటనే చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. వీరికి ఒక కుమార్తె కాగా ఆమెకు వివాహం అయింది. ఆనందపురం ఏఎస్ఐ బాలంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిడిజాల పంచాయతీలోనూ..
ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీకి చెందిన డ్రైవర్ కోరాడ సంతోష్ అలియాస్ గౌరీశంకర్ సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని భార్య అచ్చియ్యమ్మ ఈ మేరకు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 15 ఏళ్ల క్రితం వీరికి వివాహం కాగా అప్పటి నుంచి మద్యానికి బానిసైన మృతుడు కుటుంబ సభ్యులను వేధిస్తూ వస్తున్నాడు. ఈ నెల ఒకటో తేదీన భార్యతో తగాదాకు దిగిన సంతోష్ అదే రోజు సాయంత్రం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. వెంటనే చికిత్స కోసం సంగివలస ఆస్పత్రికి తరలించారు. కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు సత్కారం

పద్మనాభం: మండలంలోని స్వచ్ఛ ఉత్తమ గ్రామైక్య సంఘాలుగా ఎంపికైన రెండు గ్రామైక్య సంఘాల ప్రతినిధులను శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ జ్ఞానవేణి సత్కరించారు. ఉత్తమ గ్రామైక్య సంఘాలుగా ఎంపికైన పాత కొవ్వాడ, పొట్నూరు గ్రామైక్య సంఘాల ప్రతినిధులను ఆమె దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రూపేష్, ఏపీఎం బీవీ రమణ పాల్గొన్నారు.